# నెలనెలా వెన్నెల



## అవసరాల రామకృష్ణారావు

# • అరుణా వాళ్ళ చెల్లెలు

ఆప్పటికే అవకూడనంత ఆలస్యం అయిపోయింది. మర్నాటి పోస్టు కయినా ఆర్టికల్ వెళ్ళి తీరాలి, చచ్చి తీరాలి. ఎంతగా నాతో నేను కుస్తీపట్టి ప్రయత్నించినా, మేటర్ యివతలికి రావడం లేదు. ఇదిగో సరిగ్గా అలాంటి క్లిష్ట సమయంలో వచ్చిపడ్డాడు మా సర్వారాయుడు. వచ్చినవాడు ఊరుకుంటాడా, నానా అల్లరీను.

'ఆవురావురు మని అందుకుని అచ్చువేసుకునే వాళ్ళూ, మిషనరీ జీల్'తో కొనుక్కుని చదువుకొనే మనీజ్ఞానులూ ఉన్నన్నాళ్ళూ నీ కల్పనకి కాలదోషం పట్టక పోవచ్చునుగాని మావయ్యా, యీ పార్వతీపూర్‌లో ఫారెస్టు కాలనీలో కూచుని మొత్తం ప్రపంచాన్నే సృష్టించి పారేస్తానని నువ్వు సవాలు చేస్తేమాత్రం నాకు, నవ్వాగటంలేదు!' అని 'ఆరంభించెను నీచమానవుడు....'

'ఒరే రాయుడూ! సాగరాలు దాటినా మాతృభాష సోయగాలు మరచిపోని నీకు ఎప్పటికైనా ఓ ఆడపిల్లని పెంచి యివ్వక పోనుగానీ నీకు జవాబుచెబుతూ కూచోడానికి నాకిప్పుడు టైంలేదు. దయచేద్దూ....'

'కుర్రాడేదో చెబుదామని దగ్గిరికొస్తే అలా కసిరికొడతారేం బుద్ధి? మీ రాతా, నా రాతా ఎప్పుడూ ఉన్నదేగా?'

అని రంగంలోకి ప్రవేశించి సర్వారాయుడు కూచున్న పక్క కుర్చీలో బైఠాయించింది భార్యామణి. సమయం దొరికితే చాలు శత్రువర్గంలో చేరిపోతారు. కట్టుకున్న చిన్నదాని కన్న కట్టించుకున్న పన్నే గట్టిదేమో! కలానికి కాసేపు టోపీ వేసి, కుర్రాడిమీద కళ్ళెర్ర జేశాను.

'మీకేం తెలుసునని నోటి కొచ్చినట్లు కూస్తున్నారు? ఎక్కడ రాశారని కాదు, ఏమిటి, ఎలా అనేది ప్రధానం. చెట్టు క్రింద కూచుని ఆకుల మీద వ్యాసాలు చెక్కిన వ్యాసులవారిదే అప్పటికీ యిప్పటికీ ఇండియన్ రైటర్స్‌లో ఫస్టు ప్లేసు. స్పందించే హృదయం, సరిగా అందించే వివేకం ఉంటే సిరా శివగంగ అయి ప్రవహించదా! అనేకం చూస్తాం, అర్థం చేసుకుని అన్వయం చెప్పగల కన్నులోనే అంతా వుంది. నా చేతిలో ఉన్నది ఏమిటనుకున్నావ్ రాయుడూ, ఇది పెన్ను కాదు సుమా గన్ను! ఇందులోంచి యివతలికి పంపబడేవి లెటర్సు కాదు, బులెట్సు!'

'ఓహోహో! ఏం షోగ్గా శలవిచ్చాయ్యా! అక్షరాక్షర లక్షలు! అక్షరాలా ఉరిశిక్షలు! ఇందులో ఒక్కముక్క, ఒట్టు, ఒక్కటంటే ఒక్కముక్క, ఇదివరకు నేను వినలేదుసుమా!

అని చప్పట్లుతో చావగొట్టి, ఇంకో బాణానికి సిద్ధపడ్డాడు. అసలే మహామేధావి, దానిమీద అమెరికానుంచి ఎలక్ట్రానిక్స్‌లో డాక్టరేట్ తప్పుకొచ్చిన యువక ఎలక అది. వాడితో మాట్లాడమే ఓ ఇన్‌స్పిరేషన్. ఉత్తప్పుడైతే ఫరవాలేదు. ఊపిరి తీసుకునే టైం లేదు. యిప్పుడా? "చూడు అమ్మాజీ పీణ్ని కాస్త లోపలికి సాయంపట్టు పీటేసి కూచోబెట్టి వేడివేడి పకోడీలు కూరుదూ పాపం ఎన్నాళ్ళైందో తిని!" అన్నాను.

"అత్త చేతిపాకం నాకు కొత్తకాదు గాని నీ హస్తప్రయోగం మీదే కొన్ని సందేహాలు ఉండిపోయాయి మావయ్యా! చేసిన లిటరరీ మర్డర్స్ చాలుగానీ ఆ కుటీరపరిశ్రమకి కాస్త విశ్రాంతియిచ్చి నా ధర్మసందేహం తీర్చు. "అంతా కన్నులోనే ఉంది" అని యిప్పుడే శలవిచ్చావు ఈ శాస్త్రమయ జగత్తులో కనబడని దృశ్యాలు కూడా లేకపోలేదు. తమబోటి సర్వజ్ఞులు అలాంటి వాటిని ఎలా గ్రహిస్తారట మరి?"

నేనేం చెప్పేది దీనికి!, అలా అని ఓటమి ఎలా ఒప్పుకొనేది!

"నీకేం పనీ పాటూ లేదట్రా ఎంతో బిజీగా ఉన్న నన్ను తగులుకున్నావ్ యివాళ? 'కనబడని దృశ్యం' ఏమిటి? చెప్పేదేదో సరిగ్గా చెప్పి ఎడవరాదు?'

'అలా ఎక్సైటై పోకుగాని చిన్న సంఘటన చెబుతాను. మా ప్రాంతాల్లో జరిగిన చిత్రమే, దానికి కీలకం ఎక్కడో పట్టుకోగలవూ?" అంటూ ఓ తమాషా చెప్పకొచ్చేడు సర్వారాయుడు.

తను యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో కదా చదువుకున్నాడు. బెర్క్‌లీలో ఉండేవాడుట తనకి రూమ్ అద్దికిచ్చిన వాడు వెర్నాన్ అనే భాగ్యవంతుడట. వేరే పెద్ద భవనంలో ఉండేవారు వాళ్ళు. అతని భార్య బెత్సీ మొగుణ్ణించి విడాకులు కోరిందట అతని 'పరాజయ ప్రవేశం' భరించలేక వెర్నాన్ డైవోర్సుకి ఒప్పుకోలేదు. వంశగౌరవం దెబ్బ తింటుందని బెత్సీ మాత్రం తన పట్టుదల మానలేదు భర్తకీ పరస్త్రీ సంగమం ఉన్నట్టు రుజువు సంపాదించింది. అది కోర్టు ముందు ఉంచి విడాకులు పొందింది ఇంతే కథట.

"ఇందులో ఏముందని!" అనే మా

ఆవిడ మాటని తొలిలోనే తుంచేశాను.

"లేని అసందర్భం ఏమిటని అడుగు. తన చేష్టల్ని భార్య ఓ కంట కనిపెడు తూనే ఉందని ముందే తెలుసుకున్నా డాయె అందులో ఎవడు, మెరిక లాంటి అమెరికన్ మళ్ళీ. వాళ్ళకి లేని సదుపాయాలు, ఉపాయాలూ లేవని చెబుతారు. అలాంటిది ఇలాంటి రాస క్రీడ లకి ఋజువు ఇచ్చేసుకుని అంత సుళు వుగా పట్టుబడిపోతాడా !'

'అంతేకాదు, అసందర్భం అంతా ముందే వుంది ! బెట్సీ ఊళ్ళోలేదని స్పష్టంగా తెలిశాకే అతను సైనోని గది లోకి పిలిపించుకున్నది. కిటికీ తలుపుల దగ్గర్నుంచి అన్నీ బిడాయించి కటిక చీకటి అని నిర్ధారించుకొన్నాకే అతను ప్రియురాలి ప్రేమను చూరగొన్నది అయితేనేం వాళ్ళ రహస్యలీలలు చక్కగా ఫొటోలు తీయబడ్డాయి. ఏం చెప్ప మన్నావ్ !

'ఏం చెప్పకు. ఎందుకొచ్చిన కోతలు !'

'కోతలకి ఇవి రాతలు కావు మావయ్యా !' కారు చీకటిలో కాంతిరేఖ అని కథొకటి గీకిపారేసి డబ్బు గుంజ డానికి యిక్కడ కావలసింది ఇమాజి నేషన్‌కాదు మామయ్యా, సైన్సు !" అని పెన్నుపోటుని మించిన మరో వెన్నుపోటు పొడిచి సర్వారాయుడు అసలుకిటుకు బయటపెట్టేడు.

పడకగదిలోకి సహ ప్రవేశంగల ఒక నౌకరు సహాయంతో బెట్సీ ఆ ఏర్పాటు చేయగలిగిందట. టైమ్ బాంబ్ లలాగే ఫలానాటైమ్‌కి ఫొటోలు తీసే ఆటోమేటిక్ కెమెరాలు ఉంటాయని అందరికీ తెలిసిన విషయమే. ఆ నౌఖరు సహాయంతో పైకి కనబడని ఓమూల ఆ కెమెరా ముందుగానే బెడ్ రూమ్‌లో ఫిక్సు చేయించిందట.

ఒరే రాయుడూ ! రచన అనేది ఓ డిస్‌క్వాలిఫికేషన్ అవునో కాదో నాకు తెలీదుగాని నాకూ కొన్ని ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషన్సు లేకపోలేదు. ఎంత ఆటోమేటిక్ కెమెరా అయినా కాంతి అనేది లేకుండా ఫొటో తియ్యలేదుకదా ? చీకటిరాత్రి, అర్ధరాత్రివేళ, తలుపులన్నీ జాగ్రత్తగా వేసుకున్న గదిలో ఫొటోలు తియ్యడానికి లైట్‌సోర్సు ఎక్కడిదని?"

"నన్ను పూర్తిగా చెప్పనియ్యమరి. కెమెరా ఒకటేకాదు, ఆ గదిలో ముందుగా బల్బు ఒకటి వెలిగించి ఉంచాడు ఆ నౌఖరే.

"బల్బు వెలిగించి ఉంచితేవెర్నానో్న ఎవదో గదిలోకి వెళ్ళీవెళ్ళగానే ఆర్పె య్యలేడుటయ్యా ." అని ఇంతసేపటికి నా తరపున ఒక్క తురుపుముక్క వేసింది, అమ్మాజీ !

"ఆ వెర్నాన్‌ని ఒక్కణ్ణే కాకుండా ఇది వింటున్న మనల్నందరిన్నీ కూడా వెర్రినాన్నల్ని చేసింది. ప్రత్యేకమైన ఆ బల్బూ, అసాధారణమైన ఆ కెమేరా, ఆ బల్బులోని కాంతి మామూలు కంటికి కనబడదు. వెలిగించినా, ఆర్పినా మామూలు దృష్టికి ఒక్కలాగే ఉంటుంది అది "ఇన్ ఫ్రారెడ్" కిరణాన్ని ప్రసా రం చెయ్యగల బల్బు. అది వెలిగిస్తే గదినిండా ఇన్‌ఫ్రారెడ్ కాంతి కిరణాలు వ్యాపించి ఉంటాయి.

త ఆటోమేటిక్ కెమెరాలో సామాన్యమైనదికాక ఇన్‌ఫ్రారెడ్ ఫిల్మ్ ఏర్పాటు చెయ్యబడింది గనక చక్కగా చక చకా ఫొటోలు తీసేసి ఉంటుంది.'

'ఇన్ ఫ్రా రెడ్ ఏమిటి సర్వారాయుడూ ?' అని అడిగింది మా ఆవిడ.

'అలా అడిగేవు, బాగుంది. తెల్లని కాంతే కదా మనకి కనపడేది. అందులో ఏడు రంగులు ఉంటాయి. ఇంద్రధనుస్సులో రంగులు చూశావ్ కదూ అలా, అవి అన్నమాట. ఆ రంగులు మాత్రమే మన కంటికి గోచరించేవి. ఆ ఏడు రంగులకి అటూ యిటూ చాలా లోకం ఉంది. పైన ఉండేది అల్ట్రా వయొలెట్. కింద ఉండేది ఇన్‌ఫ్రా రెడ్. రెడ్ కలర్‌కి కిందని ఉండే యీ కిరణాన్ని అరుణా వాళ్ళ చెల్లెలు అనొచ్చు. ఇది అదే నాటకం యింతా అంతా కాదు !'

'ఇన్‌ఫ్రా రెడ్‌కి ఎంత చిత్రమైన తెలుగు పేరు పెట్టేవురా !' అన్నాను అప్రయత్నంగా.

'అతిశయోక్తులకి పుట్టినిల్లయిన మా మేనమామగారొకరున్నారులే. ఆయన దగ్గర నేర్చుకున్నాను' అన్నాడు కొంటెగా కనుగీటుతూ, దొంగరాస్కెలు.

'ఏమిటో, అంతా చిత్రంగా ఉంది !' అంది అమ్మాజీ.

'ఇదో చిత్రమా అత్తా! అరచేతిలో స్వర్గం అంటారు చూడు మనవాళ్ళు, అవగింజలో చూపించవచ్చు యిప్పుడు సమస్త లోకాలున్నూ. మోడరన్ టెక్నాలజీ ఎన్నో అసాధ్యాలని సుసాధ్యం చేసింది. మైక్రో మినియరైజేషన్ ధర్మమా అని చీమ తలకాయ అంతటి జాగాలో ఎన్ని చిద్విలాసాలైనా చలాయించవచ్చు. ఇంతెందుకు, 'టెలివిజన్ కళ్ళు' అనే సాధనం ఉంది. ఎంతుంటుంది అనుకున్నావ్, మావయ్య కథలు పంపే పొడవాటి పెద్ద కవరు చూశావు గదా, మహాలయితే అంత ! అది గదిలో ఏ డ్రాయర్లో అయినా దాచాం అనుకో, అది ఈ గదిలోఉన్న సమస్త దృశ్యాలూ నాలుగయిదు యిళ్ళ అవతల ఏర్పాటు చేసిన రిసీవర్‌కి, తను యిక్కడే ఉండి, అందించగలదు!'

'ఆడదాన్నిచేసి ఏం మాయ కబుర్లు చెబుతావ్‌రా రాయుడూ ! అడ్డు గోడలు ఏమైనట్టు ?'

'ఈ ఆగస్టు ఒకటినుంచీ మన రాష్ట్రంలో కూడా ఏర్పాటు అయిన టెలివిజన్ దృశ్యాలు అందుకుని అందచేసేది ఎవరనుకున్నావ్ ? అల్లంత ఎత్తున ఆకాశ సీమలో అమర్చబడిన అమెరికన్ సేటలైట్ కదా ! మరి అక్కణ్ణుంచి యీ ఆరు రాష్ట్రాలకీ దృశ్యాలు వచ్చిపడటండంలో అడ్డు గోడలు ఏవీ లేనే లేవంటావా ! జ్ఞానం ప్రసారం చెయ్యగల సునిశిత శక్తే ఉంటే జేజే తలలోని జేజే అయినా ఆపగలడా మావయ్యా! గదిలో దృశ్యాల వరకూ ఎందుకు, ఏదైనా పత్రిక నవలల పోటీ ఏర్పాటు చేసిందనుకొందాం. 'ఆ ఫస్టుప్రైజు నాకే యిప్పించండి. కావలిస్తే ఆ బహుమతి మొత్తం నేనే దాటుగా చదివించుకుంటాను" అని నువ్వు లోపాయికారీని ఉత్తరం రాశావనుకుందాం, ఆ పత్రికా సంపాదకులకి...."

"ఛ, ఛ....ఎంతకి తెగించావ్‌రా, ఆడీ మాటలేదు, ఆడనిమాటలేదు।"

"అబ్బ .... అనుకుందాం అన్నాను కద....మాటవరసకి రాస్తే గీస్తే రహస్య సమాచారం కనుక సైపుచేసి రిజిష్టర్డు చేయిస్తావు. అయితేనేం నువ్వు ఏం చేయించు. చూడాలనుకున్న కంటిని ఆప డం యీ రోజుల్లో నీతరం కాదు। కవరు కవరులా ఉండగానే। ఎటువైపునుంచి విప్పకుండానే, చించకుండానే లోపలి సమాచారం తెలుసుకోడానికి అవకాశాలు ఉన్నాయి యీ రోజుల్లో'

"అదెలా కుదురుతుంది సర్వా రాయుడూ।"

'అదే అత్తా తమాషా। అరుణావాళ్ళ చెల్లెలు చూపుకి అసాధ్యం లేదని చెప్పే నుగా। ఈ కిరణాల సాయంలో కవరుపై నుంచే లోపలి విషయాల ఫొటోలు తియ్యొచ్చు. ఇలా పడిన ఛాయాచిత్రాలు బాగా ఆ కళలో కృషిచేసిన పండితులు ఉంటారు చూడు, వాళ్ళచేత డిసైఫర్ చేయించి చదివించుకుంటారు. అంతవరకు అక్కర్లేదు, ఒక్క పోస్టల్ యింజక్షన్ యిప్పిస్తే చాలు।'

'పోస్టల్ యింజక్షనా। అదేమిటీ, ఎవ రికీ? పోస్టుమేన్‌కా, పోస్టుమాస్టర్‌కా?'

'అడ్డమైన గడ్డీ పోగుచేసి కంపోస్టు లాంటి చెత్త ఏరోజు కారోజు పోస్టుకి ఎత్తే నీలాంటి రచయితలకీ, రచయిత్రులకీ ఎన్ని యింజక్షన్లు యిచ్చినా తప్పులేదు గాని అది యివ్వవలసింది సీల్డుకవర్‌కి।'

'కవరుకి ఇంజక్షనా। బలే।'

'అబ్బే, నేను తమాషాకి అలాంటి పేరుపెట్టాను గాని అలాంటిదేం లేదు. అయితే. సూది అంత సన్నంగా ఉండే 'ఫ్లాష్‌లైట్'ని కవరులోకి జొనిపి లోపలి భాగం కాంతిమయంచేస్తే, చెప్పేనుగదా, దానికోసం ట్రెయినింగ్ అయిన ఇన్వెస్టి గేటర్స్ ఉంటారని. వాళ్ళు చదివేసు కుంటారు. అందుకే అన్నాను, అంతా కన్నులోనే ఉందని జబ్బలు చరుచుకో వద్దని.'

'ఒరే రాయడూ। ఆసక్తి కలిగించే కొన్ని విషయాలు చెప్పి నా వ్యాసానికి సబ్జక్టు మేటర్ సమకూర్చి పెట్టిన నీకు థాంక్సు. సైంటిస్టుల్ని పొగడ్డం కోసం రైటర్స్‌ని దుయ్యబట్టడం మాత్రం అనవ సరం. దేనిలో ఉన్న మంచి చెడ్డలు అందులో ఉంటాయి. టెలివిజన్ ద్వారా విజ్ఞాన ప్రచారం మెచ్చుకోదగ్గదే. కాని అదే టెక్నాలజీవల్ల 'మనం ఏక్షణం ఏం చేస్తే ఎవరు కనిపెట్టేస్తున్నారో' అని మనసు బాధపడి ప్రైవసీ దెబ్బతింటే జీవితం దుర్భరం అవుతుంది. ఇకఅంతా కన్నులోనే ఉంది అనే నా నిర్వచనం మార్చుకోవలసిన అవసరం నాకులేదు. ఎంచేతంటావా, సైంటిఫిక్ విజన్ వేరు పొయెటిక్ ఇమాజినేషన్ వేరు' అని ముగించాను.